జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
మంగళవారం | 19 | మే | 2026 ◆ పేజీలు : 3

## మే 18 నుంచి 23 వరకు పర్యాటక వారోత్సవాలు

- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.
- పర్యాటక వారోత్స వాల పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్




**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 18 నుండి మే 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాలను జిల్లాలో విజయవంతం చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోనీ తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పర్యాటక

మిగతా 2 లో...




# అభివృద్ధి పనులను... వేగవంతంగా పూర్తి చేయాలి

- మహిళా సంఘాల బ్యాంక్ లింకేజీ లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలి
- మధిర ప్రాంత అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** మధిర నియోజకవర్గ ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.మధిర నియోజకవర్గ ప్రాంతంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్లు డాక్టర్ పి శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి శాఖల వారీగా పనుల వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మధిర నియోజకవర్గ పరిధిలోని చింతకాని మండలంలో సాచ్యురేషన్ మోడ్‌లో లబ్ధిదారులకు మంజూరైన దళిత బంధు యూనిట్లు గ్రౌండింగ్ పూర్తి చేసినవి, వాటిలో సిక్ యూనిట్లు, విజయవంతంగా నడుస్తున్న యూనిట్లు, డైవర్ట్ అయిన యూనిట్లపై పూర్తి స్థాయి నివేదికలను సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు.జమలాపురం పర్యాటక అభివృద్ధికి 5 కోట్లు మంజూరై టెండర్లు, ఒప్పందాలు పూర్తయ్యాయని, ఆగస్టు 31 నాటికి సరస్సు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.మహిళా సాధికారతలో భాగంగా బ్యాంక్ లింకేజీ లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని,ప్రతి నెల కొత్త రుణాలకు అర్హత పొందే సంఘాల అంచనాలు సిద్ధం చేసి నెలవారీ లక్ష్యాలను నిర్ణయించాలని సూచించారు. ఆర్పీలు స్వయం సహాయక సంఘాలతో నిరంతరం సమన్వయం చేస్తూ రుణాల వినియోగం సక్రమంగా జరిగేలా చూడాలని తెలిపారు.చింతకాని మండలంలోని రామకృష్ణాపురం కాలనీలో టి-ఫైబర్ నెట్‌వర్క్ పైలట్ ప్రాజెక్టును ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని, మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు, సిగ్నల్ బూస్టర్ల అవసరాన్ని

మిగతా 2 లో...

## ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రజా వినతులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.వేంసూర్ మండలం మర్లపాడు గ్రామంలోని స్టేట్ పంచాయత్ రాజ్ చాంబెర్ ఫార్మర్ డైరెక్టర్ భీంరెడ్డి పుల్లా రెడ్డి గ్రామంలో ఆర్ అండ్ బి రోడ్డు నుంచి ఎం. అంజయ్య ఇంటి వరకు సిసి డ్రైయిన్ నిర్మించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పంచాయత్ రాజ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కొణిజెర్ల మండలం రాజ్య తండా కు చెందిన

మిగతా 2 లో...

## వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమైన పత్రాలను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో భద్రపరచుకోవాలి
- వర్షాకాలం సీజన్‌కు ముందస్తు సన్నద్ధతలో భాగంగా విజయవంతంగా ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణ



- మున్నేరు వద్ద నిర్వహించిన మాక్ డ్రిల్, ఎవాక్యుయేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని, విపత్తుల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో

మిగతా 2 లో...

# మే 18 నుంచి 23 వరకు పర్యాటక వారోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి... )

వారోత్సవాల పోస్టర్‌లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, మే 20న ఖమ్మం ఖిల్లాలో హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నట్లు, మే 21న జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై యూట్యూబ్ వీడియో ప్రెజెంటేషన్ చేసిన వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా టూరిజం సర్టిఫికెట్ ప్రధానం చేయబడు తుందని, మే 22న నేలకొండపల్లి బుద్ధ స్థూపం వద్ద స్వచ్ఛత/పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి సునీల్ రెడ్డి, తెలంగాణ టూరిజం అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్,టూరిజం ఉద్యోగి చంద్రశేఖర్ ఆజాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి... )

టి.సునీత,బి.కృష్ణ, సత్యనాగేంద్ర ముగ్గురు కలిపి గుండ్రాతిమడుగు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 46/ఊ/2/ 1/2 లో కొంత భూమి ఉందని, వీటి మార్కెట్ విలువ అధికంగా ఉందని దీనినీ తగ్గించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా అదనపు కలెక్టర్ రెవెన్యూకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ కరీమ్ టీ హబ్ డయాగ్నస్టిక్ సెంటర్ నందు ఔట్సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ గా పని చేస్తున్నప్పుడు టర్మినేషన్ పద్ధతిలో విధుల నుండి తొలగించారని తిరిగి తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎంఅండ్ హెచ్ఓకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 20న దేశవ్యాప్త మెడికల్ షాప్ లు బంద్

- **బోనకల్ తహసీల్దార్ ,ఎస్సై ల కు వినతిపత్రం అందజేసిన బోనకల్, చింతకాని మెడికల్ అసోసియేషన్ సభ్యులు**



**బోనకల్, మే 18(ప్రజా జ్యోతి ):** ఈనెల 20న దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్ నిర్వహిస్తున్నసందర్భంగా సోమవారం బోనకల్ తహసీల్దార్,ఎస్సైలకు బోనకల్ మండలమెడికల్ షాపుల యజమానులు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ఇ-ఫార్మసీల అక్రమ నిర్వహణ మరియు 28.08.2018 నాటి జి ఎస్ ఆర్ 817(E) నోటిఫికేషన్ ఉపసంహరణ, పెద్ద కార్పొరేట్ల ద్వారా దోపిడీ ధరల నిర్ణయం అక్రమ ఈ-ఫార్మసీల అనియంత్రిత పెరుగుదల, పెద్ద కార్పొరేట్ సంస్థల దోపిడీ ధరల విధానం, స్థిరపడిన ఔషధ పంపిణీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు చిన్న ,మధ్య తరహా కెమిస్ట్‌ల మనుగడకే కాకుండా, ప్రజారోగ్యానికి కూడా తీవ్రమైన ప్రమాదాలను కలిగిస్తున్నాయన్నారు.ఇదే విషయం పై ఈనెల 20 న దేశ వ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో మెడికల్ షాపు ల అధ్యక్షులు గమిడి సైదులు, ట్రెజరర్ సుగ్గల వెంకట వీర బ్రహ్మంజనేయులు, బోనకల్ మండల యూనిట్ సభ్యులు గమిడి కొండలు, షేక్ ఖాసీం పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి... )



పరిశీలించాలని సూచించారు. మధిరలో ఐటీ హబ్ ఏర్పాటు కోసం నిధుల అంచనాలు, భూకేటాయింపు ప్రతిపాదనలు సమర్పించామని, అవసరమైన ఫాలోఅప్ చేసి త్వరగా నిధులు మంజూరు జరిగేలా చూడాలని ఆదేశించారు.టీజీఐఐసీ పరిధిలో 84.17 ఎకరాల్లో చిన్న తరహా పరిశ్రమల కోసం అభివృద్ధి చేస్తున్న 264 ప్లాట్ల పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో యూజీడీ పైప్‌లైన్లు, ఇతర అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎస్టీపీ కోసం అవసరమైన భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.జోన్ వారీగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. వైరా నది ఇరువైపుల రక్షణ గోడ నిర్మాణంపై పూర్తి నివేదిక సమర్పించాలని, బోనకల్,ఎర్రుపాలెం, మధిర సమగ్ర మండల కార్యాలయ సముదాయాల నిర్మాణాన్ని సరైన ప్రణాళికతో చేపట్టాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ హాళ్లు, సమావేశ మందిరాలు, రికార్డు గదులు సమర్ధ వంతంగా ఉండేలా నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. వైరా రిజర్వాయర్ పర్యాటక అభివృద్ధికి 14 కోట్ల ప్రతిపాదనలు పంపగా 5 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అభివృద్ధి పనుల డిజైన్లను 15 రోజుల్లో ఖరారు చేయాలని సూచించారు.మధిరలో వృద్ధాశ్రమం ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలపగా, అన్ని మౌళిక వసతులతో ఏర్పాటు చేయాలని,త్రాగునీరు, మరుగు దొడ్లు, వంట గది వంటి సదుపాయాలతో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.తల్లాడలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటు కోసం 10 ఎకరాల భూమి అవసరమని, జిల్లాలో అదనంగా లక్ష మెట్రిక్ టన్నుల గోదాం సామర్థ్యాన్ని సృష్టించే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.వెంకటాపురం గ్రామంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ మున్సిపాలిటీలో యూజీడీ, వరదనీటి నిర్వహణ ప్రాజెక్టు, వీధి వ్యాపారుల పునరావాస ప్రాజెక్టు, రిటైనింగ్ వాల్ వంటి అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలి

(మొదటి పేజీ తరువాయి... )



పాటు జిల్లా యంత్రాంగాన్ని మాన్సూన్ సీజన్‌కు పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు చేపట్టిన ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.జిల్లాలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్.డి.ఎం.ఏ) మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన వరద ప్రమాదాల మాక్ ఎక్సర్సైజ్ ను జిల్లా కలెక్టర్ దివాకరటిఎస్ సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వరదల వంటి విపత్తుల సమయంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పని చేస్తే ప్రాణనష్టం నివారించవచ్చని అన్నారు. సాధారణంగా ప్రజలు నీరు కళ్లకు కనిపించే వరకు ఇళ్లను ఖాళీ చేయరని, ఈ ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు అధికారికంగా ఎవాక్యుయేషన్ సూచనలు ఇచ్చినప్పుడు ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని సూచించారు.వర్షాకాలంలో సంభవించే అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుండి సమాచారం అందిన వెంటనే వివిధ శాఖలు ఏ విధంగా స్పందించాలి,ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి,రెస్క్యూ బృందాలు ఎలా పనిచేయాలి, రిలీఫ్ క్యాంపులను ఎలా నిర్వహించాలి వంటి అంశాలపై స్టెప్ బై స్టెప్ విధానంలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య,విద్యుత్,పోలీస్,టిఎస్టి, అగ్నిమాపక,పశుసంవర్ధక శాఖ,వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సాధన నిర్వహించినట్లు తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవచ్చన్నారు.అంతకుముందు మాక్ ఎక్సర్సైజ్ లో భాగంగ వరదల కారణంగా మున్నేరు పరివాహక ప్రాంతం ముంపుకు గురవుతుందని సమాచారం అందుకున్న జిల్లా కంట్రోల్ రూమ్ సంబంధిత అధికారులను, రెస్క్యూ బృందాలను అప్రమత్తం చేసింది. స్థానికంగా ఉన్న ఆపద మిత్ర వాలంటీర్ల సహకారంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి చేర్చడం జరిగింది.రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రిలీఫ్ క్యాంప్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్, అక్కడ బాధితులకు అందించాల్సిన ఆహారం, తాగు నీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.వరదల సమయంలో ప్రజలు ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్‌లు, భూపత్రాలు వంటి ముఖ్యమైన డాక్యుమెంట్లు, విలువైన వస్తువులను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సమయంలో వెంట తీసుకుని వెళ్లేందుకు ప్రతి కుటుంబం ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని అన్నారు.ప్రజల్లో విపత్తుల నిర్వహణపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక అవగాహన వీడియోలు రూపొందించి వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఖమ్మం జనరల్ ఆస్పత్రి వద్ద వరదలలో ఎవరైనా చిక్కుకుంటే వారిని సంరక్షించి వైద్య సేవలు అందించేలా మాక్ ఎక్సర్సైజ్ చేపట్టామని అన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్డిఆర్ఎఫ్ 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ బి. మరియాదాస్, ఎన్డీఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్,ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఏఎంవిఐ,టీజీ ఎన్పిడిసిఎల్, వైద్య, ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ,మునిసిపల్, రెవెన్యూ, సివిల్ సప్లై,పోలీస్, సంబంధిత శాఖల అధికారులు, రెస్క్యూ బృందాలు,ఆపద మిత్ర వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాల నుంచి బస్టాండ్ దాకా 2కె రన్ యువజనోత్సవం

**కల్లూరు, మే 18: ప్రజా జ్యోతి**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కల్లూరులో ఆదివారం 'ఫిట్ అండ్ యాక్టివ్ 2కె రన్' ఉత్సాహంగా సాగింది. యువజన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఆధ్వర్యంలో సోమవారం కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ జెండా ఊపి 2కె రన్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ కళాశాల నుంచి కొత్త బస్ స్టాండ్ వరకు సాగిన ఈ రన్‌లో ఎమ్మార్వో బ్రహ్మేశ్వర రావు, ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పసుపులేటి వీరరాఘవయ్య, యువజన సంఘాల ప్రతినిధులు, ఎంపీడబ్ల్యూ వాకర్స్, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.రన్ అనంతరం కళాశాల మైదానంలో యోగ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. షుగర్ ఫ్యాక్టరీ యోగ గురువు మార్గదర్శకత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ రోజూ యోగా చేయాలని, నిత్యం వ్యాయామం అలవర్చుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రణాళిక లక్ష్యం ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, యువతను చైతన్యవంతం చేయడం అని అధికారులు తెలిపారు.

# ఆళ్లపాడు గ్రామ అభివృద్దే నా లక్ష్యం

- గ్రామ అభివృద్ధి చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు
- రెండు సంవత్సరాల కాలంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- ప్రస్తుతం గ్రామంలో కళ కళ లాడుతున్న వీధిలైట్లు
- డ్రైనేజీ లో ఉన్న మురికి నీటిని బయటికి పంపించేందుకు 40 బుర్రలు ఏర్పాటు
- కాంగ్రెస్ వార్డు మెంబర్లు తప్పుడు ఆరోపణలు సరికావు
- ఆళ్లపాడు సర్పంచ్ తెల్లబోయిన నాగేశ్వర రావు



**బోనకల్, మే 17(ప్రజా జ్యోతి)** గ్రామ పంచాయతీ పాలకవర్గంపై సర్పంచ్ పై కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్డ్ మెంబర్లు తప్పుడు ఆరోపణలు అసత్య ప్రచారాలు మానుకోవాలని ఖండించారు. మండల పరిధిలో ఆళ్లపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తెల్లబోయిన నాగేశ్వరావు, మాట్లాడుతూ. గ్రామంలో కొత్త పాలకవర్గం ఏర్పడిన దగ్గర నుండి కాంగ్రెస్ పార్టీ చెందిన వ్యక్తులు కొన్ని శక్తులు అడుగడుగునా అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారనీ అన్నారు.
శనివారం పత్రికల్లో వచ్చిన వార్త కథనంలో సోషల్ మీడియాలో వచ్చినటు వంటి వార్తలు వాస్తవం కాదని బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని రెండు సంవత్సరాల కాలంలో డ్రైనేజీ వ్యవస్థ బాగాలేదని సర్పంచ్ నాగేశ్వరావు, ఖండించారు.
గత రెండున్నర సంవత్సరాల కాలంలో పాలకవర్గం లేక అభివృద్ధి కుంటుపడిందనీ , డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నదని, పారిశుధ్య పనులు అసలే జరగలేదన్నారు. గ్రామం మురికి కోపంగా ఉండేదని, వీధి దీపాలు లేక గ్రామం అంధకారంలో ఉండేదనీ ,చెత్త బండికి డీజిల్ లేక తిప్పే పరిస్థితి కూడా లేదన్నారు. ఆ లాంటి పరిస్థితుల్లో కొత్త పాలకవర్గం ఏర్పడిన తర్వాత గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయడం కోసం 40 బుర్రలు తీసుకువచ్చి డ్రైనేజీ నీరు పోయేటట్టు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.
గ్రామంలో వీధి దీపాలు మంచినీటి సమస్య 95% తీర్చడమైనదన్నారు. గ్రామంలో ఉన్నటువంటి చేతిపంపు అన్నిటినీ బాగు చేయటం జరిగిందని, గ్రామంలో ప్రతి వార్డుల్లో చెత్త సేకరణ జరుగుతుందని తెలియజేశారు. గ్రామ అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్ వ్యక్తులు అసత్య ఆరోపణలు చేస్తూ గ్రామంలోనే అలజడులు సృష్టించాలని చూస్తున్నారని అన్నారు. లేని సమస్యలు ఉన్నట్టుగా సోషల్ మీడియాలో పెడుతూ అసత్య ఆరోపణలు చేస్తున్నారనీ సర్పంచ్ తెల్లబోయిన నాగేశ్వరరావు తెలియజేశారు. గ్రామ అభివృద్ధిని చూసి ఓర్వలేక గ్రామ సర్పంచ్ పై ఆరోపణలు నిరాధారం అని ఖండిస్తున్నామన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రతిరోజు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు.
కొందరు కావాలని కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో పెట్టి పంచాయతీ కార్యదర్శిని ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. తెల్లబోయిన నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. కార్యదర్శి వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ కార్యదర్శి ఒక మెమోరాండం కూడా ఇవ్వటం జరిగిందని అన్నారు.
అదే రోజు పెన్షన్లకు సంబంధించి న ఫోటోలు కూడా తీశారని వారు కావాలని సోషల్ మీడియాలో పెట్టిన అన్ని కూడా అసత్య ఆరోపణలని సర్పంచ్ ఘాటుగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండి సైదమ్మ, వార్డు మెబర్లు, అల్లిక కబ్బయ్య, షేక్ రేష్మ ,షేక్ చంద్ ,సాహెబ్ కిరణ్ ,షేక్ శరిబ్ ,పూర్ణయ్య, సంగీత, బండి నాగేశవరరావు, పుల్లయ్య, పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపు..

- క్షేత్ర స్థాయి కమిటీల బలోపేతం
- సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం



**చింతకాని మే18 ప్రజాజ్యోతి ప్రతినిధి:** సీతంపేట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ క్షేత్ర స్థాయి కమిటీల బలోపేతంలో భాగంగా, పార్టీ సభ్యత్వం నమోదు సన్నాహక సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ పలు కీలక విషయాలను వెల్లడించారు:పకడ్బందీగా డిజిటలైజేషన్ ఈసారి పార్టీ సభ్యత్వ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా,పూర్తిగా డిజిటలైజేషన్ పద్ధతిలో అత్యంత పారదర్శకంగా నిర్వహించబోతున్నాం. కార్యకర్తలకు ఇన్సూరెన్స్ రక్షణసభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్క పార్టీ కార్యకర్తకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని పక్కాగా అమలు చేయడం జరుగుతుంది. బూత్ స్థాయి శిక్షణ సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయడం మరియు పార్టీ ని బలోపేతం చెయ్యడం కోసం కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రతి బూత్ నుండి ఇద్దరు క్రియాశీల కార్యకర్తలను ఎంపిక చేసి,వారికి పార్టీ తరఫున సుశిక్షితులైన ట్రైనర్లతో ప్రత్యేక శిక్షణ ఇప్పించడం జరుగుతుంది.మన పార్టీ – మనబలం ప్రతిష్టాత్మక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ కార్యకర్తలు,యువత,మరియు నాయకులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని,కలిసికట్టుగా విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ చింతకాని మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు,మాజీ వైస్ ఎంపీపి హనుమంత రావు,మాజీ రైతు బందు నాయకులు మంకేనా రమేష్,మండల నాయకులు వంకాయలపాటి లచ్చయ్య, సీతంపేట బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోలూరి ప్రభాకర్,పార్టీ ఫౌండర్ మాజీ అధ్యక్షులు కేతినేని పుల్లయ్య,ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాగయ్య నారపోగు,బిఆర్ఎస్ అనుబంధ గ్రామ రైతు సంఘ అధ్యక్షులు కాటమనేని మహేష్,నాయకులు వెంకటి,గడ్డం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాలలో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం పై అవగాహన సదస్సు





**చింతకాని మే18 ప్రజాజ్యోతి ప్రతినిధి :** మండలంలో పలు గ్రామాలలో గ్రామంలో బిర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి హాజరై పార్టీ సభ్యత్వ నమోదు మరియు బూత్ ఏజెంట్లనియమకం గురించి చర్చించిన మండల నాయకులు ఈ కార్యక్రమంలో జిల్లానాయకులు మంకెన రమేష్ చింతకాని మండల బిర్ఎస్ పార్టీ కార్యదర్శి బొడ్డువెంకట రామారావు మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు మాజీ సొసైటీ డైరెక్టర్ వంకాయలపాటి లచ్చయ్య శ్రీనివాసరావు వెంకటేశ్వర్లు తిమ్మినేనిపాలెం సర్పంచ్ కొమ్ము ప్రభు, తీర్లపురం సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, మరీదు మధు, మరీదు శ్రీను, బండి సైదులు, గోద వెంక్కన్న, ఐతం రమేష్,ఐతం కిషోర్, ఐతం కాటయ్య, మంగరావు, కూచిపూడి సురేష్ జమలయ్య సీతయ్య షేక్ మీరాసాహెబ్, కొమ్ము నరేష్ నాదెండ్ల వెంకటేష్ తెల్ల గొర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇంటి స్లాబ్ ను ప్రారంభించిన సర్పంచ్ తాళ్లూరి స్వప్న



**చింతకాని మే 18 ప్రజాజ్యోతి ప్రతినిధి** :మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు గంటెల విజయలక్ష్మి – సామేలు(లేటు) తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషితో మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ఈరోజు స్లాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ స్లాబ్ కార్యక్రమానికి సర్పంచ్ తాళ్లూరి స్వప్న హాజరై కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చామర్తి కృష్ణమాచారి,కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి రమేష్, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మెట్టెల కృష్ణ, అలవాల నాగేశ్వరరావు, దాసరి ఉపేందర్, గంటెల బాబురావు, తదితరులు పాల్గొన్నారు,

## సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టిన చింతకాని ఎస్సై వేరేందర్



**చింతకాని మే18ప్రజాజ్యోతి ప్రతినిధి :** రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సరిహద్దుల్లో బాస్వపురం రోడ్డు చెక్ పోస్టులో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చింతకాని ఎస్సై వీరేందర్ తెలిపారు. ముఖ్యంగా అక్రమ పశు రవాణాకు సంబంధించి ఏలాంటి సమాచారం ఉన్నా తక్షణమే పోలీసులకు తెలియజేయాలి తప్ప, ఏ పరిస్థితుల్లోనూ నిందితులపై ప్రత్యక్ష దాడులకు పాల్పడి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని స్పష్టం చేశారు.

## అక్రమ ఇసుక టిప్పర్ పట్టివేత

- అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేపడితే చట్టపరమైన చర్యలు
- బోనకల్ ఎస్సై పొదిలి వెంకన్న



**బోనకల్, మే 18 (ప్రజా జ్యోతి):** ఆంధ్రా నుండి తెలంగాణకు అక్రమ ఇసుక రవాణా చేస్తున్న టీ జీ 04 టి 4569 గల ఇసుక టిప్పర్ ను ఖమ్మం వైపు వెళుతుండగా బోనకల్ పోలీసులు అడ్డగించి సోమవారం మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామం వద్ద పట్టుకున్నారు. అట్టి టిప్పర్ ను వాహనంతో పాటు ఇసుకను కూడా బోనకల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ అక్రమ ఇసుక రవాణా ఘటనలో డ్రైవర్, యజమాని, క్లీనర్‌తో సహా మొత్తం ఆరుగురు వ్యక్తులు ఉన్నారు. వారిపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు బోనకల్ ఎస్సై పోదిలి వెంకన్న తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.